క్లుప్తంగా

సత్యదీక్షల స్వీకరణ


ఏలేశ్వరంలో సత్యదీక్షల నియమాలు వివరిస్తున్న అర్చకుడు సత్యనారాయణాచార్యులు

ఏలేశ్వరం: పట్టణంలోని పలువురు భక్తులు ఆదివారం సత్యదీక్షలు స్వీకరించారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో సుమారు 29 మంది భక్తులు స్వామివారి మాలధారణ చేశారు. ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణచార్యులు తొలుత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులతో మాలధారణ చేయించి సత్యదీక్షల నియమ నిబంధనలను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆశాజనకంగా అపరాల పంటలు


ఎస్.అన్నవరంలో సాగు చేస్తున్న మినప పంట

తుని రూరల్: వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో అపరాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగునీరు లభ్యం కాని మెట్ట భూముల్లో రైతులు మినుము, పెసర వంటి అపరాలను వేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఏపుగా ఎదిగిన పైర్లు కోత దశకు చేరుకున్నాయి. నవంబర్ నెలలో కోతలు కోసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 85 ఎకరాల్లో రైతులు అపరాల సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. రబీలో అపరాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


గౌరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

అలరించిన వీధి నాటకం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు ప్రదర్శిస్తున్న వీధి నాటకాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు ఆదివారం సతీ అనసూయ వీధి నాటకం వేశారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో అనసూయగా రాచపల్లి సత్తిబాబు, వికలాంగుడైన భర్తగా యడగాల ఆదినారాయణ, మరదలుగా పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రేసింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తిపై కత్తితో దాడి


ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిట్టియ్యను పరిశీలించిన సీఐ అప్పారావు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని తోటపల్లిలో భూ వివాదం నేపథ్యంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన కోరాపు చిట్టియ్య, తుల్లు సతీష్‌ల మధ్య 34 సెంట్లు భూమికి సంబంధించి వివాదం కొన్నాళ్లుగా నలుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద కోరాపు చిట్టియ్యను తుల్లు సతీష్ కత్తితో దాడి చేసినట్లు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న కోరాపు చిట్టియ్యను సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం పరిశీలించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారిద్ర్యం..!

- గోతులమయంగా ప్రధాన రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


గోతులమయంగా కిర్లంపూడి- ప్రత్తిపాడు రోడ్డు

కిర్లంపూడి: మండలంలోని ప్రధాన రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. పలు గ్రామాల్లో రహదారులు గోతులతో అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వర్షం వస్తే ఆయా గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. గోడ్డుపై రాళ్లు పైకి లేచిపోవడంతో రహదారిపై వెళ్లే ఆటోలు, ఇతర వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయి.

చినుకు పడితే నరకయాతనే..

మండలంలోని రాజుపాలెం-వీరవరం, రామచంద్రపురం, తామరాడ, గోనేడ మీదుగా జగ్గంపేట మండలం రామవరం వెళ్లే రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. చినుకు పడితే ఆయా గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. భారీ వాహనాలు జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఆటోల్లో ప్రయాణించేవారు, ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లేందుకుభయపడుతున్నారు. వీరవరంలోని ఎస్సీపేట వద్ద ఉన్న నూతన కల్వర్టును అసంపూర్తిగా వదిలేయడంతో రోడ్డు మధ్యలో రంధ్రం పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

విద్యార్థుల అవస్థలు

రాజుపాలెం, రామకృష్ణాపురం, ముక్కొల్లు గ్రామాల నుంచి సుమారు 70 మంది విద్యార్థులు వీరవరం ప్రభుత్వ పాఠశాలకు వస్తుంటారు. వర్షం వస్తే సైకిళ్లు గోతుల్లో పడి విద్యార్థులకు గాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. ఈ రోడ్డులో భారీ లోడులతో క్వారీ లారీలు కాకినాడ పట్టణానికి వెళ్తుంటాయి. దీంతో జగపతినగరం నుంచి ప్రత్తిపాడు మధ్యలో 3 కిలోమీటర్ల మేర పెద్దపెద్ద గోతులు పడ్డాయి. అలాగే జగపతినగరం అడ్డురోడ్డు నుంచి సింహాద్రిపురం వెళ్లే రహదారి నిర్మాణం అసంపూర్ణంగా వదిలేయడంతో రాళ్లు పైకి తేలి ప్రయాణికులను బుడిద చుట్టిముడుతోంది.

అత్యవసర సేవలకూ తిప్పలు

రోడ్లపై భారీ గుంతల కారణంగా అత్యవసర సేవందించే 108 వాహనాలు సకాలంలో చేరుకోలేకపోతున్నాయి. రోడ్లు గోతులతో అస్తవ్యస్తంగా మారినప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న రాజుపాలెం- వీరవరం రోడ్డు (ఫైల్)


జగపతినగరం-సింహాద్రిపురం అడ్డరోడ్డు ఇలా..

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం



రాజుపాలెం నుంచి వీరవరం, రామచంద్రపురం, తామరాడ, పాలెం, తామరాడ, గోనేడ గ్రామాలకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. ఈ మార్గంలోని వీరవరం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షం కురిస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నాం. తామరాడ-పాలెం బ్రిడ్జిపై గోతులు పడి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– గోకాద రాజా, తామరాడ ఎంపీటీసీ

సమస్య పరిష్కారానికి చర్యలు

గ్రామాల్లో రహదారులు ఛిద్రం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– బి.హరికృష్ణ, ఎంపీడీఓ, కిర్లంపూడి

ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్


జగ్గంపేటలో ట్రాన్స్‌జెండర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి మార్గాలు, ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా జీవనం సాగించడంపై సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కౌన్సెలింగ్ ఇచ్చారు. సర్కిల్ పరిధిలోని ట్రాన్స్‌జెండర్స్‌తో ఆదివారం జగ్గంపేటలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గండేపల్లి మండలం మురారి నుంచి కిర్లంపూడి మండలం సోమవారం వరకూ రాత్రి సమయంలో జాతీయ రహదారిపై గస్తీ ఏర్పాటు చేశామన్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్ల వద్దకు వెళ్లి అధిక మొత్తంలో సొమ్ములు ఇవ్వాలని డిమాండ్ చేయడం తగదన్నారు. ట్రాన్స్‌జెండర్లపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్ల వద్ద గలాట సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పూర్తిగా ఇదే వృత్తిపై ఆధారపడకుండా వేరే ఉపాధి మార్గాలు చూసుకోవాలన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేరులో స్వల్పంగా తగ్గిన నీటినిల్వలు


ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు స్వల్పంగా తగ్గాయి. ఇటీవల వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. జలశయం పరివాహక ప్రాంతం నుంచి 266 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 85.46 మీటర్లు, 24.11 టీఎంసీలు గాను 21.88 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ఆయకట్టుకు 1,100, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపి వేశారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు


తాళ్లూరులో ట్రాక్టర్‌లోకి మట్టిని నింపుతున్న జేసీబీ

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పోలవరం కాలువ మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తాళ్లూరు శివారులో కొందరు అక్రమార్కులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్లలో మట్టిని నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. పునాదుల్లోకి అంటూ సాకులు చెబుతు ఖాళీస్థలను ఫిల్లింగ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు చెల్లించకుండా పగలు, రాత్రి అని తేడా లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- స్వామివారిని దర్శించిన 40 వేల మంది భక్తులు
- దేవస్థానానికి రూ.35 లక్షల ఆదాయం


సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: ఏకాదశి పర్వదినం, సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' కలిసి రావడంతో రత్నగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని దర్శించిన భక్తులు గోశాలలో సప్తగోవులను దర్శించి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు నిర్వహించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.35 లక్షలు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. ఆలయ ప్రాంగణంలో సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు.

జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరిచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివ లింగానికి పండితులు పంచామృతాలతో మహాన్యాశ పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలు, స్వర్ణాభరణాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

యాగశాలలో ఆయుష్యహోమం

స్వామివారి యాగశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు అయుష్యహోమం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు హోమం ప్రారంభించి 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు.

ఘనంగా ఏకాదశి పూజలు

ఆశ్వీయుజ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవునికి ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పార్చన, తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారికి సహస్ర తులసిదళార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ స్వామివారిని దర్శించి పూజలు చేశారు.


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి


ఎస్సై సతీష్

కిర్లంపూడి: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ సూచించారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూశాఖ నుంచి వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుని అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. విక్రయదారులు, గోదాముల నిర్వాహకులు విధిగా ఫైర్ సెఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ సమావేశంలో నిర్ణయం
- దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లను వివరించిన ఈఓ రామచంద్రమోహన్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: కార్తిక మాసంలో సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదివారం రత్నగిరిపై జరిగిన దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారుల సమావేశంలో నిర్ణయించారు. ప్రకాష్ సదన్ సత్రంలో జరిగిన సమావేశానికి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అధ్యక్షత వహించగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్ ఐవీ రోహిత్ హాజరయ్యారు.కార్తిక మాసంలో వచ్చే భక్తుల కోసం దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లను ఈఓ కె.రామచంద్రమోహన్ వివరించారు. కార్తిక మాసంలో భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విభాగాల అధికారులు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. నవంబర్ 13న సత్యదేవుని తెప్పోత్సవం, 15న సత్యదేవుని గిరిప్రదక్షిణ కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఈఓ కోరారు. భక్తులకు సత్యదేవుని దర్శనం సులభంగా జరిగేలా, వ్రతాల నిర్వహణ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరి రాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరి బాబు, వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, దేవస్థానం అధికారులు, గ్రామ సర్పంచ్ ఎస్ కుమార్‌రాజా పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలు

★ కార్తిక మాసంలో శని, ఆది, సోమవారాలతో పాటు పర్వదినాల్లో స్వామివారి సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు అవకాశం ఉన్నందున విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

★ పర్వదినాల్లో తెల్లవారుజామున ఒంటి గంట నుంచే స్వామివారి వ్రతాలు, రెండు గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలకు అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తారు.

★ పౌర్ణమి, ఏకాదశి పర్వదినాల్లో పశ్చిమ రాజగోపురం వద్ద రోప్ పార్టీని ఏర్పాటు చేసి భక్తులను బృందాల వారీగా దర్శనానికి అనుమతిస్తారు.

గిరి ప్రదక్షిణ 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుంది. ఆరు గంటలకు పంపా నది వద్ద పంచ హారతులు, రాత్రి ఏడు గంటలకు తొలిపాంచా వద్ద జ్వాలాతోరణం నిర్వహిస్తారు.


కార్తికమాస ఏర్పాట్లలో భాగంగా పశ్చిమ రాజ గోపురం వద్ద నిర్మిస్తున్న భక్తుల విశ్రాంతి షెడ్డు

★ కార్తిక మాసం నెల రోజులూ చిన్నకార్లు, ఆటోలు మినహా మరే ఇతర వాహనాలను కొండమీదకు అనుమతించరాదని నిర్ణయించారు. పెద్ద వాహనాలను కళాశాల మైదానంలో నిలిపివేసి భక్తులను దేవస్థానం బస్సుల్లో కొండమీదకు తరలించాలని నిర్ణయించారు.

★ రత్నగిరిపై రెండు వేల మంది సేద తీరేందుకు వీలుగా రత్నగిరి డార్మెట్రీ, విష్ణుసదన్‌లోని 36 హాల్స్, సీఆర్వో కార్యాలయం వద్ద ఒక డార్మెట్రీ అందుబాటులో ఉన్నాయి. డార్మెట్రీలలో అన్ని సదుపాయాలు ఉన్నాయి.

దేవస్థానానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కొండదిగువన మెయిన్‌రోడ్‌లో బెండపూడి వైపు ఆర్చి నుంచి తుని వైపు ఆర్చి వరకు సెంట్రల్ లైటింగ్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

★ దేవస్థానం, కొండదిగువన మెయిన్‌రోడ్, రైల్వేస్టేషన్ రోడ్డులో పారిశుధ్యం మెరుగుపడేలా అదనపు సిబ్బంది ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు.

కొండ దిగువన, దేవస్థానంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అన్నిచోట్ల సీసీ కెమెరాలు, పశ్చిమ రాజగోపురం, ఆలయ ప్రాంగణంలో రెండు చోట్ల రెండు సమాచార కేంద్రాలు, పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తారు.

★ విజయవాడ, విశాఖపట్నం, జిల్లాలోని ముఖ్య పట్టణాల నుంచి అన్నవరానికి అదనపు బస్సులు నడపడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని తుని డిపో మేనేజర్ తెలిపారు.

★ దేవస్థానం రెండు ఘాట్‌రోడ్లు, అన్నవరం మెయిన్‌రోడ్‌లో గోతులు పూడ్చి భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

★ కార్తిక మాస పర్వదినాల్లో రత్నగిరిపై ఓ అంబులెన్స్, కొండ దిగువన మరో అంబులెన్స్‌ను ఉంచాలని నిర్ణయించారు. మూడు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నారు.

గండం నుంచి గట్టెక్కిన రైతన్నలు


వీరవరంలో మెషీన్‌తో వరి కోతలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను గండం గట్టెక్కడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో దాదాపు 40 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. రెండు నెలల క్రితం కురిసిన కుండపోత వర్షాలకు పంటలు దెబ్బతిన్న సంగతి పాఠకులకు విదితమే. కాగా ఇటీవల అల్పపీడన ప్రభావంతో మళ్లీ వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందారు. వర్షాల నుంచి తేరుకుంటున్న తరుణంలో దానా తుపాను ప్రకటనలో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. తుపాను ప్రభావంతో ఈ ఏడాది కూడా నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు తుపాను తీరం దాటి సాధారణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరి కోతలు ప్రారంభం

కిర్లంపూడి: మండలంలో వరి కోతలు ప్రారంభయ్యాయి. వీరవరం, కిర్లంపూడి తదితర గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరి పంటలను రైతులు మెషీన్లతో కోయించి ఒబ్బిడి చేసుకుంటున్నారు. కోత కోసి, కుప్పలు నూర్చే పని లేకుండా ధాన్యం వ్యాపారులు పొలం దగ్గరికే వచ్చి క్వింటా పచ్చి ధాన్యానికి రూ.1500 ధరను ఇవ్వడంతో రైతులు వారికి అమ్మడానికే మొగ్గు చూపుతున్నారు. మండలంలో సుమారు 13 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది వరిసాగు చేశారు. కాగా రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని అధికారులు సూచిస్తున్నారు.